కమ్యూనిటీహాల్ నుంచి బతుకమ్మ చీరల తరలింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



డీసీఎంలో తరలిస్తున్న చీరలు

చిక్కడపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీహాల్‌లో బతుకమ్మ చీరలు శీర్షికతో ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గత ఏడాది బతుకమ్మ పండుగ సందర్భంగా చీరల పంపిణీని ఎన్నికల కోడ్ దృష్ట్యా నిలిపివేశారు. గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన దాదాపు 35వేల చీరలను మొదటి అంతస్తులో రూమ్‌లలో ఉంచి తాళం వేశారు. అందులో పదివేల చీరలు పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. కమ్యూనిటీహాల్‌లో శుభకార్యాలు నిర్వహించుకోవడానికి ఎస్ఆర్‌టీ, టీఆర్‌టీ కాలనీ వాసులు జీహెచ్ఎంసీకి డబ్బు చెల్లించినా మొదటి అంతస్తులో కార్యక్రమాలు నిర్వహించుకోనీయడం లేదు. బతుకమ్మ చీరలను కమ్యూనిటీ హాల్ నుంచి తొలగించాలని స్థానికులు, రెసిడెన్షియల్ సొసైటీ వాసులు జీహెచ్ఎంసీ డీఎంసీకి విజ్ఞప్తి చేశారు. మంగళవారం రెండు లారీల్లో చీరలను కమ్యూనిటీ హాల్ నుంచి అడిక్‌మెట్ కమ్యూనిటీ హాల్‌లో స్టోర్‌రూమ్‌కు తరలించారు.

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం


పరిసరాలను శుభ్రం చేయిస్తున్న కార్పొరేటర్

బర్కత్‌పుర, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి అన్నారు. మంగళవారం నింబోలిఅడ్డ, మోతీమార్కెట్, చప్పల్‌బజార్, సత్యనారాయణస్వామి ఆలయం వీధి తదితర ప్రాంతాలలో జీహెచ్ఎంసీ సిబ్బందితో పరిసరాలను శుభ్రం చేయించారు. బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, ఎస్ఎఫ్ఏ అమరేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలి


నినాదాలు చేస్తున్న పార్టీలు, సంఘాల నేతలు

కవాడిగూడ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. మంగళవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద ఎస్సీ ఎస్టీ సంఘాల సమాఖ్య, సోషలిస్టు పార్టీ ఇండియా, పీపుల్స్ ప్రొటెక్షన్ పార్టీ తదితర సంఘాల ఆధ్వర్యంలో 'ఈవీఎంలు వద్దు.. బ్యాలెట్‌లు ముద్దు' అంటూ నినాదాలు చేశారు. ప్రముఖ న్యాయవాది ఆనంద్‌కుమార్, సోషలిస్టు పార్టీ ఇండియా తెలంగాణ అధ్యక్షురాలు సుభద్రారెడ్డి, భారత ఎస్సీ ఎస్టీ సంఘాల సమాఖ్య అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడారు. ప్రముఖ న్యాయవాది సదానందరెడ్డి, మహేశ్వర్‌రాజ్ పాల్గొన్నారు.

'పేదలపై అక్రమ కేసులు ఎత్తివేయాలి'

రాంనగర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు, ఇళ్ల స్థలాల కోసం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాలు, పేదలపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని ప్రజా సంఘాల నేతలు సీఎం రేవంత్‌రెడ్డిని మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కేసులు ఎత్తివేసేందుకు చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారన్నారు. సీఎంను కలిసిన వారిలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ప్రజా సంఘాల పోరాట వేదిక నాయకులు టి.సాగర్, ఆర్.వెంకట్ రాము ఉన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో బీసీ, ఎంబీసీల సంక్షేమానికి

రూ. 2 లక్షల కోట్లు కేటాయించాలి

రాంనగర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో బీసీ, ఎంబీసీల సంక్షేమానికి రూ. 2 లక్షల కోట్లు కేటాయించాలని, ప్రత్యేకంగా బీసీ మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని, బీసీ కులగణన చేయాలని కోరుతూ ఎంబీసీ సంఘాల జాతీయ సమితి కన్వీనర్, తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కో-ఆప్షన్ ఫోరం అధ్యక్షుడు కొండూరు సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్‌కు ఈమెయిల్ ద్వారా లేఖ పంపినట్లు మంగళవారం బాగ్‌లింగంపల్లిలో విలేకరులకు తెలిపారు.

వంశీ లేఖిని జాతీయ సాహితీ పురస్కారాల ప్రదానం

చిక్కడపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తెలుగు రచయిత్రులు వేరే భాషా రచయిత్రులకు ఏమాత్రం తీసిపోరని వారి రచనలు ఇతర భాషల్లోకి అనువాదం అయితే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వస్తుందని ప్రఖ్యాత రచయిత్రి పొత్తూరి విజయలక్ష్మి అన్నారు. వంశీ కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, లేఖిని రచయిత్రుల వేదిక ఆధ్వర్యంలో మంగళవారం త్యాగరాయగానసభలో వంశీ లేఖిని జాతీయ సాహితీ పురస్కారాల ప్రదానం జరిగింది. ఇల్లిందల సరస్వతి, భానుమతి, ద్వివేదుల విశాలాక్షి, మాదిరెడ్డి సులోచన, డా. ఆనందరామం, అరికపూడి కౌసల్యాదేవి యద్దనపూడి సులోచనారాణి పేరిట అవార్డులను ఆచార్య సుమతీ నరేంద్ర, వి నాగలక్ష్మి, గౌరీలక్ష్మి, గంటి భానుమతి, జయశ్యామల, జీహెచ్ లక్ష్మి తదితరులకు అందజేశారు. వంశీరామరాజు పాల్గొన్నారు.

'త్యాగరాజస్వామి కీర్తనలు తెలుగు భాషా సంపద'

త్యాగరాజస్వామి కీర్తనలు తెలుగు భాషా సంపద అని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. త్యాగరాయగానసభలో సమ్మోహన స్కూల్ ఫర్ మ్యూజిక్ ఆధ్వర్యంలో త్యాగరాజస్వామి 177వ ఆరాధన వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆయన మాట్లాడుతూ.. త్యాగరాజస్వామి కీర్తనలు ప్రతి గుడిలో వినిపించాలన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా త్యాగరాజస్వామి ఆరాధన వేడుక

మంగళవాయిద్య కళాకారుల సంఘం ఆధ్వర్యంలో వాగ్గేయకారుడు త్యాగరాజ స్వామి ఆరాధన వేడుక మంగళవారం వైభవంగా జరిగింది. బాగ్‌లింగంపల్లి హనుమాన్ దేవాలయం నుంచి మేళతాళాలతో త్యాగరాజ చిత్రపటంతో త్యాగరాయగానసభ వరకు కళాకారులు ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం సంఘం అధ్యక్షుడు కందుకూరి నరసింహారావు ఆధ్వర్యంలో గానసభలోని దేవాలయ ప్రాంగణంలో త్యాగరాజస్వామి రచించిన పంచరత్నకీర్తనల గోష్ఠిగానం జరిగింది.

ఘనంగా సుందరకాండ కార్యసిద్ధి హోమం

వివేక్‌నగర్‌లో ఆంజనేయస్వామి ఆలయంలో అష్టోత్తర శత హనుమాన్ చాలీసా సహిత శ్రీమత్ సుందరకాండ కార్యసిద్ధి హోమం ఘనంగా కొనసాగుతోంది. మంగళవారం 108 సార్లు హనుమాన్‌చాలీసా పారాయణం, సుందరకాండ పారాయణం నిర్వహించారు.

పునరావాసం కల్పించే వరకూ ఇక్కడే..

- స్వామి వివేకానందనగర్ బాధితులు

చిక్కడపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఇళ్లను అన్యాయంగా కూల్చివేశారని, ప్రత్యామ్నాయం చూపేవరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని స్వామి వివేకానందనగర్ వాసులు భీష్మించుకు కూర్చున్నారు. సోమవారం అరెస్టయిన బాధితులు తిరిగి బస్తీకి చేరుకున్నారు. అక్కడే వంట వండుకుని ఉంటున్నారు. తమకు షెల్టర్ లేకుండా చేశారని ధ్వజమెత్తారు. పునరావాసం కల్పించే వరకు ఇక్కడి నుంచి వెళ్లేది లేదన్నారు. బస్తీ ఏర్పడిన తర్వాత నిర్మించుకున్న అపార్ట్‌మెంట్ వారికి మద్దతుగా నిలిచిన అధికారులు ఇళ్లను కూల్చివేశారని విలపించారు. కోర్టు ఉత్తర్వుల పేరుతో 70 ఏళ్ల నుంచి నివసిస్తున్న తమను రోడ్డున పడేశారన్నారు.

పోరాటం ఆగదు

స్వామి వివేకానందనగర్ బస్తీవాసులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని కార్పొరేటర్ ఎ. పావనివినయ్‌కుమార్ అన్నారు. బాధితులకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని కోరుతూ మంగళవారం ముషీరాబాద్ తహసీల్దార్ వెంకటలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కూల్చిన చోటే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు పి.శంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం బస్తీవాసులను పరామర్శించి సంఘీభావం తెలిపారు.


జాతిపితకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ నాయకులు


గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్ తదితరులు


తిలక్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కె.కిరణ్‌కుమార్, టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి జె.దశరథ్ తదితరులు

జాతిపితకు నివాళి

ముషీరాబాద్/అంబర్‌పేట జోన్ బృందం (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో పలు ప్రాంతాల్లో మంగళవారం మహాత్మాగాంధీ వర్ధంతి నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, పలు పార్టీల నాయకులు జాతిపిత విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్రం సాధించిన ఆయన సేవలను కొనియాడారు.


టీడీపీ నగర కార్యాలయంలో నివాళులర్పిస్తున్న సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.సాయిబాబా, నల్లెల కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు


బాకారంలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ సీనియర్ నేత కెన్నడీ రాజు, డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ తదితరులు


గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు


నివాళులర్పిస్తున్న అంబర్‌పేట కాంగ్రెస్ నేతలు

ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో

రూ. 2.88 కోట్లతో అభివృద్ధి పనులు


తాళ్లబస్తీలో డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ రచనశ్రీ

కవాడిగూడ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో రూ. 2.88 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులను ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్ మంగళవారం ప్రారంభించారు. మంగళవారం దోమలగూడ తాళ్లబస్తీలో రూ. 7 లక్షల వ్యయంతో డ్రైనేజీ పైపులైన్, గగన్‌మహల్‌లో రూ. 7 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న తాగునీటి పైపులైన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. కార్పొరేటర్ రచనశ్రీ, మాజీ కార్పొరేటర్ టి. రవీందర్. బీఆర్ఎస్ నాయకుడు ముఠా జైసింహ, బీజేపీ రాష్ట్ర నాయకుడు జి. వెంకటేష్, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, బీజేపీ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఎంసీ మహేందర్‌బాబు, ఎ. ప్రభాకర్ గంగపుత్ర, బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎన్‌డీ సాయికృష్ణ, వాటర్ వర్క్స్ డీజీఎం కార్తీక్‌రెడ్డి, తాళ్లబస్తీ అధ్యక్ష కార్యదర్శులు సీహెచ్ శ్రీనివాస్‌ముదిరాజ్, శివరాజ్, ఎల్ఐసీ దోమలగూడ వాటర్‌వర్క్స్ మేనేజర్ శ్రీధర్, ఏఈ సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్‌లో సీసీ రోడ్లు..

రాంనగర్: దయారమార్కెట్ నుంచి రాజా డీలక్స్ మెయిన్ రోడ్డువరకు రూ. 1.20 కోట్ల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు పనులు, హరినగర్ నుంచి ఎస్ఆర్‌టీ కాలనీ వరకు రూ. 85 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ కె.రవిచారితో కలిసి ఎమ్మెల్యే ముఠాగోపాల్ మంగళవారం ప్రారంభించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. బీఆర్ఎస్ నాయకులు శంకర్‌ముదిరాజ్, మన్నెదామోదర్‌రెడ్డి, డేవిడ్‌రాజ్, ఎర్రం శేఖర్, గోకనవీన్, మురళి, డేవిడ్‌రాజు, జీహెచ్ఎంసీ డీఈ గీత, ఏఈ మురళి తదితరులు పాల్గొన్నారు.

దుర్గానగర్‌లో..

అంబర్‌పేట: దుర్గానగర్‌లో రూ. 60 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పెండింగ్ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేస్తామన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు. కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్, జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


దుర్గానగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ తదితరులు

కామ్‌గార్‌నగర్‌లో డ్రైనేజీ పైపులైన్..

గోల్నాక: కామ్‌గార్‌నగర్‌లో రూ. 9 లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ పైపులైన్ పనులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మంగళవారం ప్రారంభించారు. అనంతరం బస్తీలో కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి పాదయాత్ర చేసి సమస్యలు తెలుసుకున్నారు. కమ్యూనిటీ హాల్, హ్యాండ్ బోరు మరమ్మతులు చేయిస్తానని బస్తీ వాసులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గండికోట జనార్దన్, ఎ.సురేష్‌గౌడ్, పడకంటి అంజయ్యచారి, ఎం.సత్యనారాయణ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో

కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేయండి

- మహిళా కార్యకర్తలకు రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు పిలుపు


మాట్లాడుతున్న సునీతారావు

రాంనగర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు పిలుపునిచ్చారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలో వీఎస్టీ ఫంక్షన్ హాల్‌లో సికింద్రాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పి.కవిత, ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ సంయుక్తాధ్వర్యంలో రెండు జిల్లాల కార్యకర్తల సమావేశం జరిగింది. ఎ

ముఖ్యఅతిథిగా పాల్గొన్న సునీతారావు మాట్లాడుతూ.. రెండు జిల్లాల్లో అసెంబ్లీ నియోజకవర్గాల్లో డివిజన్, బ్లాక్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్‌కు ఓటు వేసేలా కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్, బీజేపీ నేతలు చేసే ఆరోపణలను తిప్పి కొట్టాలన్నారు. పీజేఆర్ కుమార్తె విజయారెడ్డి మాట్లాడుతూ.. కార్యకర్తలకు తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. సికింద్రాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పి.కవిత, ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడారు.

రిజర్వేషన్లపై యూజీసీ ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలి


మాట్లాడుతున్న కృష్ణస్వరూప్

కవాడిగూడ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్‌లపై యూజీసీ ప్రతిపాదనలను తక్షణమే ఉపసంహరించుకోవాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వి. కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అభ్యర్థులు లేరంటూ దళిత బహుజనులకు కేటాయించిన ఖాళీలను డీ రిజర్వ్ చేసి వాటిని ఓసీ అభ్యర్థులతో భర్తీ చేయడానికి యూజీసీ చర్యలు తీసుకుంటుందని ఆరోపించారు. ఈ కుట్రల వెనక ఆర్ఎస్ఎస్ హస్తం ఉందన్నారు. యూజీసీ ప్రతిపాదనలను ఉపసంహరించుకోకపోతే దేశంలో తిరుగుబాటు తప్పదన్నారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరం సతీష్‌కుమార్, సీహెచ్ శ్యామ్‌కుమార్, నాయకులు సుబ్బారావు, గణేష్, రవి, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర విద్యాశాఖ నిర్ణయం అభినందనీయం

అంబర్‌పేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యాసంస్థల్లో రిజర్వ్ కేటగిరి స్థానాలను అన్ రిజర్వుడ్‌గా మార్చడానికి యూజీసీ చేసిన ప్రతిపాదనలను కేంద్ర విద్యాశాఖ తిరస్కరించడం అభినందనీయమని అఖిల భారతీయ రాష్ట్రీయ సైనిక్ మహా సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలూరు యాదయ్య అన్నారు.

మంగళవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేటాయించిన స్థానాలకు అర్హులైన అభ్యర్థులు లేకపోతే వాటిని అన్ రిజర్వ్‌గా మార్చడానికి యూజీసీ చేసిన ప్రతిపాదనలు ఆమోదయోగ్యం కాదన్నారు. కేంద్ర ఉన్నత విద్యాసంస్థలలో 2019 చట్టం ప్రకారం రిజర్వేషన్ ప్రాతిపదికన నియామకాలు చేపట్టాలని కేంద్ర విద్యాశాఖ అన్ని విశ్వవిద్యాలయాలను ఆదేశించడం అభినందనీయమన్నారు. రిజర్వ్ కేటగిరిలో బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు.

మాదిగలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


అభివాదం చేస్తున్న డాక్టర్ చీమ శ్రీనివాస్, ఓరుగంటి ఆనందం, రాజేందర్ తదితరులు

బర్కత్‌పుర, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మాదిగ, మాదిగ ఉప కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, లిడ్‌క్యాప్‌ను పునరుద్ధరించి వాటి భూములను లిడ్ క్యాప్ కార్పొరేషన్‌కు కేటాయించాలని డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మాదిగ, మాదిగ ఉప కులాల ఫెడరేషన్ ఆవిర్భావం జరిగింది. ఫెడరేషన్ చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ.. అన్ని రాజకీయ పార్టీలు త్వరలో జరిగే ఎన్నికల్లో మాదిగలకు రెండు ఎంపీ సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశంలో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలనారు. సత్ శిరోమణి గురు రవిదాస్ మహరాజ్ జయంతి ఫిబ్రవరి 24న రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, మాజీ మంత్రి టి.ఎన్.సదాలక్ష్మి విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని, ఎమ్మెల్సీ, రాజ్యసభ, నామినేటెడ్ పోస్టులలో మాదిగలకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఫెడరేషన్ కార్యవర్గం

మాదిగ, మాదిగ ఉప కులాల ఫెడరేషన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ వెల్లడించారు. కన్వీనర్‌గా ఓరుగంటి ఆనంద్, సలహాదారులుగా ఆరేపల్లి రాజేందర్, అధికార ప్రతినిధిగా పి.వీరస్వామి, గౌరవ చైర్మన్‌గా డాక్టర్ రాజమౌళి, వైస్ చైర్మన్లుగా గడ్డం యాదయ్య, పవన్‌కుమార్, కొమ్ము ప్రవీణ్, పశుపతి, కో-కన్వీనర్లుగా జన్ను బాస్కర్, గంధం రాములు, శివకుమార్, దేవదానం, నర్సయ్య తదితరులు ఎన్నికయ్యారని ఆయన తెలిపారు.

రేపటి నుంచి హరికథా మహోత్సవం

రవీంద్రభారతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కళాపోషకుడు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డా.కేవీ.రమణాచారి పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకొని కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో హరికథా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మద్దాళి రఘురామ్ తెలిపారు. ఫిబ్రవరి 1 నుంచి 7వ తేదీ వరకు నల్లకుంట శృంగేరి మఠం వేదికగా ఈ మహోత్సవాలు జరగనున్నాయి. ఈ కార్యక్రమాన్ని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రారంభించనున్నారు.

మొదటి రోజు డా.సప్పాభారతి శివలీలలు హరికథాగానం, తర్వాతి రోజుల్లో ఎర్రా శ్రీనివాస్ -గజేంద్రమోక్షం, ఆర్.రేఖ - వినాయక విజయం, మడమల రాంబాబు - మహాకవి కాళిదాసు, జల్దా విశ్వనాథ జయరాములు - శ్రీనివాస కళ్యాణం, జె.జె.నారాయణ - భక్త మార్కండేయ, గరిమెళ్ల సత్యవతిచే సీతారామ కళ్యాణం హరికథాగానం చేయనున్నారు. ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు హరికథాగానం ప్రారంభమవుతుందని రఘురామ్ తెలిపారు.

నియామకాలు

కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శులుగా జగదీశ్‌బాబు, ఆనంద్‌ముదిరాజ్




చిక్కడపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శులుగా గుండు జగదీశ్ బాబు, వి. ఆనంద్ ముదిరాజ్ నియమితులయ్యారు. సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం. అనిల్‌కుమార్ యాదవ్ వారికి నియామకపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పటిష్ఠతకు కృషి చేస్తామన్నారు.

ఉపాధ్యక్షులుగా వరదరాజు, గంగాధర్‌యాదవ్..




రాంనగర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా ఉపాధ్యక్షులుగా ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకులు వి.వరదరాజు, ఎస్.గంగాధర్‌యాదవ్ నియమితులయ్యారు. వారి నియామకాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ మంగళవారం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ.. పార్టీ పటిష్ఠతకు కృషి చేస్తామన్నారు. తమకు పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ దళిత విభాగం ఉపాధ్యక్షుడిగా అచ్యుత రమేష్‌బాబు



రాంనగర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ దళిత విభాగం ఉపాధ్యక్షుడిగా అచ్యుత రమేష్‌బాబు నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని ఏఐసీసీ దళిత విభాగం అధ్యక్షుడు రాజేష్ లిలోతియా, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విభాగాల కో-ఆర్డినేటర్ కొప్పుల రాజు మంగళవారం ప్రకటించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ.. పార్టీ పటిష్ఠతకు కృషి చేస్తానన్నారు. తనకు పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర దళిత విభాగం అధ్యక్షుడు నగరి ప్రీతమ్, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీకి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా గౌరిసతీష్, విష్ణువర్ధన్‌రెడ్డి



రాంనగర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ అధ్యక్షుడిగా గౌరిసతీష్, ప్రధాన కార్యదర్శిగా విష్ణువర్ధన్‌రెడ్డి ఎన్నికయ్యారు. మంగళవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో ఎన్నికల అధికారులు వరదరాజు, డాక్టర్‌శ్రావణ్‌కుమార్, నరేందర్‌రెడ్డి, అఫ్సర్‌ఖాన్‌ల పర్యవేక్షణలో అసోసియేషన్ కార్యదర్శుల ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా గౌరసతీష్, ప్రధాన కార్యదర్శిగా విష్ణువర్ధన్‌రెడ్డి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రైవేట్ జూనియర్ కళాశాలల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ట్యూషన్ ఫీజులు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అరసం నగర ఉపాధ్యక్షుడిగా రామ్మోహన్‌రెడ్డి



బర్కత్‌పుర, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అభ్యుదయ రచయితల సంఘం (అరసం) హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడిగా గుర్రం రామ్మోహన్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై సృజనాత్మక సాహిత్యం మరింతగా రావాల్సిన అవసరం ఉందన్నారు.

వృద్ధుడి అదృశ్యం

చిక్కడపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఇంటి బయటకు కూర్చున్న వృద్ధుడు కనిపించకుండాపోయాడు. హరినగర్‌కు చెందిన గోలి వెంకటరామయ్య(74) ఈనెల 27వ తేదీ మధ్యాహ్నం ఇంట్లో వారితో కలిసి భోజనం చేసి వాకింగ్‌కు వెళ్లి వచ్చి ఇంటి బయట కూర్చున్నాడు. సాయంత్రం 5 గంటలకు కుటుంబ సభ్యులు చూడగా కనిపించలేదు. ఆయన ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.